క్లుప్తంగా

డ్రైవింగ్ లైసెన్సులు అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం కేంద్రంలోని యువకులకు మాజీ సర్పంచ్ గడ్డం సంతోష్‌రెడ్డి బుధవారం డ్రైవింగ్ లైసెన్సులను అందజేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఇటీవల ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. యువకుల కోసం ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సొంత ఖర్చులతో లైసెన్సులు ఇప్పించడం అభినందనీయమన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజీ శ్రీనివాస్, నాయకులు రజనీకాంత్, నల్మెల మోహన్‌రెడ్డి, గంగారెడ్డి, సత్యం, మహేశ్, నల్లన్న, క్రాంతి, సందీప్, సునీల్, సూర్య, నవీన్, ప్రదీప్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈవో దుర్గా ప్రసాద్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రగతి, హాజరుతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నూత్‌పల్లి గ్రామానికి చెందిన ఆకాంక్షకు ఇటీవల గుండె ఆపరేషన్ కాగా, తోటి విద్యార్థులు సేకరించిన రూ.1,35,600 విరాళాన్ని ఆమెకు అందజేశారు. ఆయనవెంట ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ




ఆర్మూర్‌టౌన్: 'గుప్పెడు బియ్యం' కార్యక్రమంలో భాగంగా ఆర్మూర్ పట్టణంలో ఆర్పీ గంగామణి ఆధ్వర్యంలో బుధవారం పేద మహిళలకు బియ్యం పంపిణీ చేశారు. ప్రతినెలా పేద మహిళలను గుర్తించి తనవంతు సహాయంగా ఐదు కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మహిళా సంఘం సభ్యులు పల్లవి, మీనా, విశాలి, సౌందర్య, గంగామణి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



బాల్కొండ: రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని మెండోరా మండల సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓటరు స్లిప్పులు పంపిణీ, పోస్టల్ బ్యాలెట్ పత్రాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఓటరుకు ఓటింగ్ స్లిప్పు అందాలన్నారు. సమావేశంలో సెక్టర్ అధికారులు రాజేశ్వర్, సాయాగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని నేతలను ఓడించాలి



ఖలీల్‌వాడి: ప్రజా సమస్యలను పట్టించుకోని నేతలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. నగరంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తల సభ్యుల విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేశ్‌బాబు మాట్లాడుతూ.. ప్రజా సంపదతో ఏర్పాటు చేసుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరిస్తూ కార్పొరేట్ కంపెనీలకు లాభాలను తెచ్చే పద్ధతులను అవలంబిస్తున్నదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇళ్ల స్థలాల హామీని మరిచిందని, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్ రాములు, పెద్దిసూరి, సుజాత, కటారి రాములు, నర్సయ్య, కృష్ణ, అనసూయమ్మ, మునావర్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ ఎందుకు వచ్చారు

- 'డబుల్' ఇళ్లు ఎంత మందికి ఇచ్చారు
- బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ప్రశ్న



బోధన్‌లో నిర్వహించిన స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

బోధన్‌టౌన్/నవీపేట(బోధన్): రైతులకు రుణ మాఫీ చేస్తామని, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని మాటలు చెప్పిన సీఎం కేసీఆర్ ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలని బోధన్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బోధన్ ప్రజలను మోసం చేసిన కేసీఆర్ మళ్లీ ఇప్పుడు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఆయా వార్డుల్లో కాంగ్రెస్ స్ట్రీట్ కార్నర్‌మీటింగ్‌లు, నవీపేట మండలం జన్నేపల్లిలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం అప్పులపాలయ్యిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదాన్ని మరిచిన సీఎం తన కుటుంబ సభ్యులకు పదవులు, ఆస్తులు కట్టబెట్టారని విమర్శించారు. ఇరిగేషన్ మినిస్టర్‌గా ఉన్న కాలంలో తాను ప్రాజెక్టులను పట్టించుకోలేదని సీఎం అనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధిలో ఎమ్మెల్యే 25శాతమైనా చేశాడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిని నేటికీ గ్రామీణులు గుర్తు చేసుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే కుటుంబ సభ్యులు, కార్యకర్తలకే పథకాలను వర్తింపజేశారని ఆరోపించారు. సమాజ సేవ చేస్తున్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు కుమారుడు రోహిత్‌కు టికెట్ ఇవ్వడంలో బీఆర్ఎస్ ఎందుకు వివక్ష చూపిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్నర్ మీటింగుల్లో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి, కౌన్సిలర్ అబ్దుల్లా, పట్టణ అధ్యక్షుడు పాషా మోయినొద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ హరికాంత్‌చారి, మున్సిపల్ మాజీ చైర్మన్ గౌసొద్దీన్, ప్రధానకార్యదర్శి విష్ణు, జిల్లా అధికారప్రతి నిధి ప్రమోద్, నాయకులు షర్ఫొద్దీన్, సులోచన, జన్నేపల్లిలో నాయకులు సుధాకర్‌రావ్, జంగిటి రాంచందర్, చామంతి రాజు, రచ్చ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

రెంజల్(బోధన్): మండలంలోని పేపర్‌మిల్ గ్రామానికి చెందిన 20 మంది యువకులు బీజేపీ, బీఆర్ఎస్‌ల నుంచి సుదర్శన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి సుదర్శన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల నాయకులు మొబీన్‌ఖాన్, ధనుంజయ్, సాయారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

వేల్పూర్/బాల్కొండ: సీఎం కేసీఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో భారీ సంఖ్యలో చేరుతున్నారని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, యువకులు ఇతర పార్టీల కార్యకర్తలు మంత్రి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామం నుండి టీపీసీసీ రాష్ట్ర డెలిగేట్, మాజీ సొసైటీ చైర్మన్ క్యాతం గంగారెడ్డి, నీటి సంఘం మాజీ చైర్మన్ గడ్డం ముత్యంరెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎర్రోళ్ల చిన్నారెడ్డి, రిక్కల రవి, కార్యకర్తలు, వెంచిర్యాల్ గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాశపు నర్సారెడ్డి, సామ శ్రీనివాస్, వార్డు మెంబర్ గడ్డం రాజేశ్వర్. కార్యకర్తలు, మెండోరా మండలం సొన్‌పేట్ గ్రామానికి చెందిన క్రేజీ బాయ్స్, ఫ్రీడమ్, యూనిటీ యూత్ యువజన సంఘాల సభ్యులు, ఆదివాసీ నాయకపోడ్ సంఘ సభ్యులు, వేల్పూర్ మండలం పడగల్‌కు చెందిన రాజారపు మురళి, కార్యకర్తలు కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. మోర్తాడ్ మండలం గాండ్లపేట్‌కు చెందిన యువకులు మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ పార్టీలో చేరారు. ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామానికి చెందిన ఒల్లెంగుల మల్లేశ్, కార్యకర్తలు కాంగ్రెస్ నుండి తిరిగి సొంతగూటికి చేరారు. విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పార్టీలో చేరి మంత్రికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. బాల్కొండ మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్, వైస్ ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న, సామ వెంకట్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





పార్టీలో చేరిన వారితో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటే



నర్సాపూర్‌లో మహిళలతో మాట్లాడుతున్న అన్నపూర్ణ

- బాల్కొండ బీజేపీ అభ్యర్థి అన్నపూర్ణ

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్: ప్రధాని నరేంద్రమోదీ చేసిన పసుపుబోర్డు ఏర్పాటు ప్రకటనతో ప్రతిపక్షాల దిమ్మతిరిగిందని బాల్కొండ బీజేపీ అభ్యర్థి ఏలేటి అన్నపూర్ణ అన్నారు. కమ్మర్‌పల్లి మండలం నర్సాపూర్, భీమ్‌గల్ మండలం సిద్దపల్లిలో అన్నపూర్ణ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు ఒక్కటేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తే ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ నాయకులు గెలిస్తే పార్టీ మారబోమని గ్యారంటీ ఇస్తారా? అని ప్రశ్నించారు. బాల్కొండలో బీజేపీని గెలిపిస్తే అర్హులందరికీ ఇళ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. బాల్కొండలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇస్తే ఎప్పుడు చూడనంత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో కొత్తగా రూ.400కే సిలిండర్ ఇస్తామని చెబుతున్నారని, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా ఇవ్వని వారు మళ్లీ గెలిస్తే ఇస్తామనడం వారి అసమర్థ పాలనకు నిదర్శనమన్నారు. అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, మండల అధ్యక్షుడు కట్ట సంజీవ్, ములిగే మహిపాల్, బాబురావు, శ్రీనివాస్, భీమ్‌గల్ మండల పార్టీ అధ్యక్షుడు మహిపాల్, బీజేవైఎం మండల అధ్యక్షులు నిరంజన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ సుభిక్షం

- కాంగ్రెస్, బీజేపీకి ఓటేస్తే దుర్భిక్షమే
- ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి



ఉమ్మెడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నందిపేట్/పెర్కిట్(ఆర్మూర్): సీఎం కేసీఆర్ సారథ్యంలోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే దుర్భిక్షం తాండవిస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. నందిపేట మండలం ఉమ్మెడ, ఆర్మూర్ మండలం గగ్గుపల్లిలో జీవన్‌రెడ్డి బుధవారం 'ప్రజా ఆశీర్వాదయాత్ర' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని, తనను మరోసారి గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉమ్మెడ గ్రామ ప్రగతి నివేదికను గ్రామస్తుల ముందు ఉంచారు. తనకు అభివృద్ధి, సంక్షేమం తప్ప మరో పనిలేదన్నారు. బీఆర్ఎస్ అంటే బడుగులు, రైతుల సంక్షేమమని, కాంగ్రెస్, బీజేపీలది అవినీతి, అరాచకమని అన్నారు. ఉమ్మెడ–పంచగూడ వంతెన నందిపేట మండలానికి కొత్త వైభవం తీసుకొచ్చిందన్నారు. వంతెన నిర్మాణంతో భూముల ధరలు పెరిగాయని, రోడ్ల నిర్మాణం పూర్తయి కొత్తగా 20 బస్సు సర్వీసులు రానున్నాయన్నారు. నందిపేట్ మార్కెట్‌కు జనం పోటెత్తుతున్నారని, ఇక్కడ బస్సు డిపో ఏర్పాటు దిశగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రూ. 3వేల కోట్లతో ఆర్మూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, నియోజకవర్గంలో 62 వేల మందికి పింఛన్లు, 62 వేల మందికి రైతుబంధు ద్వారా పెట్టుబడి సాయం అందుతున్నట్లు తెలిపారు. ఆర్మూర్‌లో ఆయా కులాలకు 17 ఫంక్షన్ హాళ్లు నిర్మించామని, సిద్దులగుట్టకు రూ.20కోట్లతో ఘాట్‌రోడ్డు, రూ.120 కోట్లతో పంచగూడ వంతెన నిర్మించడంతోపాటు రూ.500 కోట్లతో రోడ్లు, 11 బైపాస్ రోడ్లు, ఆర్మూర్‌కు వంద పడకల ఆస్పత్రి, ఆర్మూర్ రెవెన్యూ డివిజన్, కొత్తగా డొంకేశ్వర్, ఆలూరు మండలాల ఏర్పాటు పనులు చేశామని వివరించారు. 25వేల మందికి పైగా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందించామని, మరో ఐదు వేల మందికి ఎల్‌వోసీ చెక్కులు ఇప్పించినట్లు తెలిపారు. 450 కోట్ల రూపాయలు ఖర్చు చేసి మొత్తం నియోజకవర్గంలోని 81 గ్రామాలకు, 36 వార్డులకు ఇంటింటికీ మిషన్ భగీరథ మంచినీటి సరఫరా, రూ.120కోట్లతో ఫత్తేపూర్–చేపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వంటివి బీఆర్ఎస్ ప్రభుత్వ విజయాలని ఆయన పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ఒక లక్షా 116 రూపాయల చొప్పున ఇస్తూ 15వేల నుంచి 20వేల మంది పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు జరిపించామన్నారు. ఇంత అభివృద్ధి గతంలో ఎప్పుడైనా చూశారా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే మేనిఫెస్టోను అమలు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రగతి రథం మరింత ముందుకు సాగాలంటే తనను దీవించాలని కోరారు. ఆర్మూర్ గడ్డపై రౌడీయిజం సాగదని, కాంగ్రెస్ అవినీతి పార్టీ అయితే.. బీజేపీ అవకాశవాద పార్టీ అని విమర్శించారు. కారు జోరులో ఆ పార్టీలు కొట్టుకుపోవడం ఖాయమని అన్నారు. ఉమ్మెడ, గగ్గుపల్లి గ్రామాల ప్రజలు జీవన్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు.

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ కృషి



హాజరైన గ్రామస్తులు

- ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తాం
- బాల్కొండ కాంగ్రెస్ అభ్యర్థి సునీల్‌రెడ్డి

బాల్కొండ: రైతు సంక్షేమానికి కాంగ్రెస్ కృషి చేస్తుందని, తాము అధికారంలోకి రాగానే ఏకకాలంలో రూ.2లక్షల రుణం మాఫీ చేస్తామని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. మెండోరా మండలం పోచంపాడ్, దూదిగాం, వెల్కటూర్ గ్రామాల్లో సునీల్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో రాబందువుల్ల దోచుకు తిన్నదని, ధాన్యం కొనుగోళ్లలో కడ్తా పేరుతో రైతులను మోసం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రెండు లక్షల రుణ మాఫీ, రైతు పెట్టుబడి సాయం 15 వేలు, భూమి లేనివారికి ఏడాదికి రూ.12 వేలు, 500 రూపాయలకే సిలిండర్ అందిస్తామన్నారు. ఇళ్లు లేని వారికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలు అందిస్తామన్నారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆయా గ్రామాల్లో సునీల్‌రెడ్డికి మహిళలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పార్టీ మండల అధ్యక్షుడు ముత్యం రెడ్డి, నాయకులు రమేశ్, పట్నాయక్, గంగాథెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోచంపాడ్‌లో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

కాంగ్రెస్‌లో చేరికలు

కమ్మర్‌పల్లి/బాల్కొండ/భీమ్‌గల్: కమ్మర్‌పల్లి మండలం నాగాపూర్, భీమ్‌గల్ మండలం పిప్రికి చెందిన పలువురు యువకులతోపాటు ముప్కాల్ మండలం నాగంపేట్, వేంపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ముత్యాల సునీల్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ విజయం కోసం అందరు సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు. మాజీ ఎంపీపీ జక్క రాజేశ్వర్, బాల్కొండ మండల పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ ఉన్న ఐఎంఎల్ డిపోను బాల్కొండ, ఆర్మూర్ నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు శక్తి బుధవారం పరిశీలించారు. డిపో మేనేజర్‌తో మాట్లాడి ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి ఇప్పటి వరకు సాగిన మద్యం అమ్మకాల వివరాలను తెలుసుకున్నారు. ఏ ప్రాంతంలో ఎక్కువ మద్యం దిగుమతి చేసుకున్నారు, ఎన్నికల ప్రకటన వెలువడడానికి ముందు మద్యం అమ్మకాలు ఏ స్థాయిలో ఉన్నాయని తెలుసుకున్నారు. మద్యం నిల్వలు, కేటాయింపులు, అమ్మకాల వివరాలను తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. పోలింగ్‌కు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ఓటర్లను ప్రలోభ పెట్టే అవకాశం ఉన్నందున మద్యం విక్రయాలపై గట్టి నిఘా పెట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయం తరువాత మద్యం విక్రయించే వైన్సులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వ్యయ పరిశీలన కమిటీ నోడల్ అధికారి పాపయ్య, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఉన్నారు.



డిపో అధికారులతో మాట్లాడుతున్న అబ్జర్వర్ శక్తి

నామినేషన్ల ఉపసంహరణ

ఆర్మూర్: ఆర్మూర్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 21 మంది అభ్యర్థులకుగాను 8మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఎన్నికల అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. బొంత సాయన్న (ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ), రాజేశ్(ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్)తోపాటు స్వతంత్ర అభ్యర్థులు బ్యాగరి భూమన్న, చెంచుల అశోక్, సుద్దపల్లి సుధాకర్, కర్రాజి ప్రశాంత్, రాజేష్ నారాయణపేట, గోర్త రాజేందర్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు వివరించారు. 13 మంది ఎన్నికల బరిలో ఉన్నారని తెలిపారు.

బాల్కొండ నియోజకవర్గానికి..

భీమ్‌గల్: బాల్కొండ నియోజకవర్గానికి మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులకు గాను స్వతంత్ర అభ్యర్థి ఈర్ల సాయిబాబు తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మొత్తం ఎనిమిది మంది ఎన్నికల బరిలో ఉన్నారని, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారిణి చిత్రామిశ్రా తెలిపారు.

వినయ్, జీవన్ మధ్య రహస్య ఒప్పందం

- ఆర్మూర్ బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి ఆరోపణ



వల్లభాపూర్‌లో మాట్లాడుతున్న పైడి రాకేశ్‌రెడ్డి

నందిపేట్/ఆర్మూర్ టౌన్/మాక్లూర్ (ఆర్మూర్): కాంగ్రెస్ అభ్యర్థి వినయ్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి మధ్య రహస్య ఒప్పందం ఉందని, వారికి ఓట్లు వేసి ప్రజలు మళ్లీ మోసపోవద్దని బీజేపీ అభ్యర్థి పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ, నందిపేట మండలం మాయపూర్, బాద్గుణ, ఉమ్మెడ, మాక్లూర్ మండలం వల్లభాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో రాకేశ్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాన్యుడు ప్రభుత్వానికి బకాయి ఉంటే నేరం చేసినట్లు ప్రవర్తించే అధికారులు, ఆర్టీసీకి ఎమ్మెల్యే కోట్ల రూపాయలు బకాయి ఉన్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని తప్పుడు పనులు చేస్తున్నారని ఆరోపించారు. వినయ్‌రెడ్డికి ఓటు వేసినా జీవన్‌రెడ్డికి ఓటు వేసినట్లేనని, మళ్లీ మోసపోవద్దని తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రతి గ్రామంలో ఇళ్ల నిర్మించడంతోపాటు ఇంట్లో ఇద్దరికి పింఛన్లు అందిస్తామని, తరుగులేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. మాజీ సర్పంచ్ రావుల సురేశ్, మాజీ ఉప సర్పంచ్ సాయిరెడ్డి బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరగా, రాకేశ్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాకేశ్‌రెడ్డి వెంట నాయకులు కంచెట్టి గంగాధర్, యామాద్రి భాస్కర్, నందిపేట మండల బీజేపీ అధ్యక్షుడు సాయిరెడ్డి, శివ, కొండూరు ఎంపీటీసీ రాజు, సతీష్, ముత్యం, సురేశ్‌నాయక్, గంగోనే సంతోష్, ముప్పా గంగారెడ్డి, సాయకులు వంజరి జలంధర్, సాయిలు, మహిపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు లేకుండా చూడాలి

వర్ని: పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి సమస్యలు లేకుండా సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు లలిత్ నారాయణసింగ్ అధికారులకు సూచించారు. వర్ని, చందూర్, మోస్రా మండలాల్లోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. కేంద్రాల వద్ద ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.

18న ఉపన్యాసం

నిజామాబాద్ సిటీ: ఇతిహాస సంకలన సమితి ఇందూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న 'ఇందూరు నాటక రంగం– నాటకరంగ చరిత్ర' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. బుధవారం సంస్థ కార్యాలయంలో తెయూ ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. హరిచరణ్ మార్వాడి విద్యాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు 'ఇందూరు నాటక రంగం –నాటక రంగ చరిత్ర' అనే అంశం మీద విశేష పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన బాదర వేణి నాగరాజు మాట్లాడుతారని తెలిపారు.

పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేయాలి



బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ హరిదాసు

వర్ని: బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి గెలుపునకు కలిసికట్టుగా పనిచేయాలని వర్ని జెడ్పీటీసీ హరిదాసు కార్యకర్తలను, నాయకులను కోరారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని గ్రామగ్రామాన తిరిగి ఓటర్లకు వివరించి శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేసే విధంగా చైతన్య పర్చాలని కోరారు. ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రతి ఓటరుకూ వివరించాలని సూచించారు. మండల ఇన్‌చార్జి పోచారం రవీందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కలాల్ గిరి, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, నాయకులు వీర్రాజు, రెడ్డి రాజు, సీహెచ్ గంగాధర్, లీలా శంకర్ పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – టైగర్ 3 (తెలుగు)- 10.25
ది మార్వెల్స్(తెలుగు)-1.50, 7.10, 9.45
దీపావళి (తెలుగు) - 04.25

స్క్రీన్-2 – జపాన్(తెలుగు)- 12.10, 3.30, 6.50, 10.10

స్క్రీన్-3 – జపాన్(తెలుగు)- 10.00
కీడా కోలా(తెలుగు)- 1.20
జిగర్ తండ డబుల్‌ఎక్స్ (తెలుగు)- 4.00, 10.25
మా ఊరి పొలిమేర (తెలుగు)-7.35

స్క్రీన్-4 – టైగర్ 3 (తెలుగు)- 11.45, 3.10, 6.35, 10.00